తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని వివిధ అభివృద్ధి పనులు చేపట్టేలా అధికారులను ఆదేశించాలని ఆదివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో పలువురు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో బన్సీలాల్‌పేట డివిజన్‌లోని బోయిగూడ, భోలక్‌పూర్, ఐడీహెచ్‌కాలనీ, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు జరగనున్నాయని, ఆయా ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ లీకేజీ లేకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాల తొలగింపునకు, అవసరమైన చోట్ల స్ట్రీట్‌లైట్లను ఏర్పాటుచేసే విధంగా వెంటనే చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశించాలని వారు ఎమ్మెల్యే తలసానిని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, శివ, ఎస్.మల్లేష్, కళ్యాణ్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు



ఆధ్యాత్మిక ప్రసంగం చేసిన శ్రీ సద్గురు సాయికుమార్ బాబా

బన్సీలాల్‌పేట్: మానసిక ప్రశాంతత...శారీరక ఆరోగ్యం బాగున్నప్పుడే మనిషి ఆనందంగా జీవించడానికి వీలవుతుందని సద్గురు శ్రీ సాయి కుమార్ బాబా అన్నారు. ఆదివారం పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ సాయిబాబా దేవాలయంలో ప్రాంగణంలో సద్గురు సత్సంగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సద్గురు శ్రీ సాయి కుమార్ బాబా భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మనిషి జీవితం విలువ తెలుసుకోకుండా ఆందోళన కరమైన జీవితాన్ని కొనసాగిస్తూ అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. బహు బంధాల్లో ఇరుక్కొని మానసిక ఒత్తిడికిలోనై అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. ఆధ్యాత్మిక మార్గంలోనే మనిషి ఆనందంగా జీవిస్తూ.....జీవితాన్ని సార్థకత చేసుకోడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

లష్కర్ జిల్లా సాధన సమితి కన్వీనర్ల నియామకం



నియామక పత్రాలు అందిస్తున్న పవన్‌కుమార్‌గౌడ్

సికింద్రాబాద్: లష్కర్ జిల్లా సాధన సమితి ఖైరతాబాద్ నియోజకవర్గం కన్వీనర్‌గా మహేందర్ బాబు, కో కన్వీనర్ గా మహేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆదివారం నియామక పత్రాలను అందించారు. అనంతరం పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజెప్పి ప్రత్యేక జిల్లా ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక జిల్లా సాధన సమితి ప్రతినిధులు శైలేందర్, జగదీష్ గౌడ్, సునీల్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, అశోక్ చారి, అజీజ్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో బారికేడ్లనే ఢీకొట్టి...

ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలు

వెంగళరావునగర్: డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో కారును ఆపకుండా బారికేడ్లను కారుతో ఢీకొట్టిన ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు మైత్రీవనం సమీపంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో ఎస్‌ఆర్‌నగర్ ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి కారును చెకింగ్ వద్ద ఆపకుండా వెళుతున్నాడు. అతనిని ఆపడానికి హెడ్ కానిస్టేబుల్ బి.ఎం.సుభాన్ బారికేడ్లు అడ్డు పెట్టాడు. అయితే కారు డ్రైవర్ బారికేడ్లను కారుతో ఢీకొట్టి వేగంగా వెళ్ళిపోయాడు. ఈ సంఘటనలో హెచ్.సి.సుభాన్‌కు గాయాలయ్యాయి. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాన్‌షాపులో దొంగతనం

వెంగళరావునగర్: పాన్‌షాపులో దొంగలు ప్రవేశించి సిగరెట్లు, నగదు దోచుకుపోయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... బోరబండకు చెందిన మహ్మద్ కౌసర్ యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి షాపును మూసివేసి ఇంటికి వెళ్ళాడు. ఇంటి నుంచి అర్ధరాత్రి దాదాపు 3.30 సమయంలో సీసీ టీవీని పరిశీలించగా దొంగ షాపులో ప్రవేశించడం గమనించాడు. హుటాహుటిన పాన్‌షాపునకు రావడంతో అప్పటికే దొంగ రూ.55 వేలు ఖరీదు చేసే సిగరెట్లు, రూ.14 వేలు నగదును దోచుకెళ్ళాడు. బాధితుడు ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోల్కొండ రిసార్ట్స్ పేరుతో మోసం

రూ. 29,425 వసూలు చేసిన సైబర్ నేరగాళ్లు

బంజారాహిల్స్: గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్ అండ్ స్పా రిసెప్షనిస్టు పేరుతో మోసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. షేక్‌పేటలోని ఆదిత్య ఎంప్రెస్ టవర్స్‌లో నివసించే రాహుల్‌శర్మ (28)స్పాకు వెళ్లేందుకుగాను గూగుల్‌లో సెర్చ్ చేస్తుండగా దొరికిన నెంబర్ ఆధారంగా ఫోన్ చేశాడు. అవతలి నుంచి తాను గోల్కొండ రిసార్ట్స్ అండ్‌స్పా రిసెప్షనిస్టు అని పరిచయం చేసుకున్నారు. రిసార్ట్స్ అండ్ స్పా ఫీజుకు గాను రూ.14,725 చొప్పున రెండుసార్లు ఖాతాకు బదిలీ చేయించారు. అయితే మీ దగ్గరి నుంచి డబ్బులు రావడం లేదని, ఎక్కడ లోపం ఉందంటూ తామిచ్చిన నెంబర్‌పై క్లిక్ చేయాల్సిందిగా సూచించారు. దీంతో అనుమానం వచ్చిన రాహుల్ శర్మ మరోసారి ప్రశ్నించగా అవసరమైతే మీరు ఇక్కడికి వచ్చి చెక్ చేసుకోవాల్సిందిగా చెప్పారు. దీంతో ఆయన గోల్కొండ రిసార్ట్స్‌కు వెళ్లి ఆరా తీయగా అక్కడ అలాంటి వారు ఎవరూ పనిచేయడం లేదని, ఫేక్ వెబ్‌సైట్, ఫోన్‌నెంబర్ ఉపయోగించి మోసం చేశారని రిసార్ట్స్ యజమాని తెలిపింది. రెండు విడతలుగా తాను రూ.29,425 పోగొట్టుకున్నాని, ఈ సైబర్ మోసంపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాహుల్‌శర్మకు వచ్చిన ఫోన్ కాల్‌ను పరిశీలించగా అది రాజస్తాన్ నుంచి వచ్చిందని, సుశీల మీనా పేరుతో నెంబర్ నమోదై ఉందని గుర్తించారు. ఈ ఘటనపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోనం.. వైభవం



బోనంతో వస్తున్న యువతి



పూర్ణకుంభంతో ఎమ్మెల్యే గణేష్‌ను స్వాగతం పలుకుతున్న ఆలయ ఈవో రవికాంత్

రసూల్‌పురా: ఆషాఢమాసం సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బాలం రాయిలో వివిధ ఆలయాల్లో బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ దేవి దండుమారమ్మ, శీతల పోచమ్మ, మైసమ్మ, గండమ్మ, నల్లపోచమ్మ ఆలయాల్లో భక్తులు ఉదయం నుండే అమ్మవార్లకు బోనం, నైవేద్యం సమర్పించారు. దండు మారమ్మ ఆలయంలో ఈవో రవికాంత్ ఆధ్వర్యంలో జరిగిన బోనాల జాతరలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత సాయన్న, బోర్డు మాజీ సభ్యురాలు బి. అనితా ప్రభాకర్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, అభి,ఏఖం, సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదం తదితర కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.



పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత తదితరులు



శీతల పోచమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న జంపన ప్రతాప్ తదితరులు

ఘనంగా మేడిబావి బోనాలు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి మేడిబావి శ్రీ ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు బోనాలు తీసుకొచ్చి అమ్మవార్లకి సమర్పించుకున్నారు. శ్రీ ముత్యాలమ్మ, పోచమ్మ అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ చైర్మన్ పరికి బండ కళాప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో సీతాఫల్ మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్, బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, లష్కర్ జిల్లా సాధనసమితి అధ్యక్షుడు గుర్రం పవనకుమార్, బీజేపీ ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, వివిధ పార్టీల నాయకులు నోముల ప్రకాశరావు, సాదం బాల్‌రాజ్‌యాదవ్, రాచమల్ల సంగీత్, సామ్రాట్ మల్లికార్జున్, కొండల్ వేంకటేశ్వరరావు, బీజేపీ సికింద్రాబాద్ ఇంచార్జి కందాడి నాగేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కందినారాయణ పాల్గొని పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.





బోనాల వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్





ఆలయం ముందు పోతరాజుల వీరంగాలు

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలోల్లో.. రూ.27, నల్ల వంకాయ 40, పొడుగు వంకాయ 40, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 23, క్యారెట్ 37, దొండ 40, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 70, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 17, బీట్ రూట్ 28, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 55, కందగడ్డ 50, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

వ్యక్తి అదృశ్యం



రాజు (ఫైల్)

అడ్డగుట్ట: పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. వనపర్తిలోని గౌరాయికుంట తండాకు చెందిన రాజు(34) కొంత కాలం క్రితం తన భార్యతో కలిసి నగరానికి వచ్చి మహేంద్రాహిల్స్‌లో నివాసం ఉంటున్నాడు. కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 27న ఉదయం 8.30 గంటల సమయంలో పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో రాజు భార్య సంధ్య అతనికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా ఆచూకీ తెలియకపోవడంతో శనివారం స్థానిక తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకోవాలి

పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు 250 గజాల స్థలం, కుటుంబంలో ఒకరికి ప్రతీ నెలకు రూ. 25 వేల పింఛన్ వెంటనే ఇవ్వాలని తెలంగాణ అమరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావలి మణ్యం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ చొరవ తీసుకుని ముఖ్యమంత్రితో త్వరలోనే అమరుల కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయించాలని ఆయన కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళ, ఉపాధ్యక్షుడు నాగరాజుతో కలసి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే నాలుగున్నర కోట్ల మంది తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడతాయని తమ కుటుంబ సభ్యులు వారి ప్రాణాలను తృణప్రాయంగా వదిలారని అలాంటి వారి కుటుంబ సభ్యులను గత 10 సంవత్సరాలుగా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అమరుల కుటుంబాలకు సమయం ఇచ్చి వారి సాదక బాధలు వినాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సరస్వతి, చంద్రకాంత్, ప్రవీణ్, నరేష్, ధన్‌రాజ్, కనకరాజులు పాల్గొన్నారు.

21న భారత్ బంద్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డీబీపీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఈనెల 21వ తేదీన చేపట్టనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ రాజకీయ ప్రయోజనాలకు కట్టుబడి ఈ తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లలో క్రిమిలేయర్‌ను అమలు చేయాలనే కుట్ర ఈ తీర్పు వెనుక దాగి ఉందన్నారు. మొత్తం రిజర్వేషన్లనే రద్దు చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని ఆయన ఆరోపించారు.

- పార్లమెంట్, భారత రాష్ట్రపతి ప్రమేయం లేకుండా ఉద్దేశ పూర్వకంగా ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా జరిగిందన్నారు. ఆర్టికల్ 14,15,16లను వక్రీకరిస్తూ ఈ కేసులో తీర్పు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు లేని అధికారాలు, సుప్రీంకోర్టుకు లేని అధికారాలను ఉపయోగించి ఈ తీర్పును కాంగ్రెస్ సహకారంతో ప్రధాని నరేంద్రమోదీ తీర్పు చెప్పించారని అన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ ఇచ్చిన తీర్పును మొత్తం యావత్ దేశంలోని ఎస్సీ, ఎస్టీ, దళిత సమాజం వ్యతిరేకిస్తుందన్నారు.
- సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న దేశ వ్యాప్తంగా భారత్ బంద్‌కు దళిత బహుజన సంస్థలు, పలు రాజకీయ పార్టీలు, ఉద్యమ, సామాజిక, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ పీఎల్ రాజు, జీఎన్ రావు, బండి ఈశ్వర్, జొన్నలగడ్డ భాస్కర్ రావు, సిలివేరి వసంత్‌రావు, ఉప్పాడ శ్రీరామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: రంగురంగుల కాటన్, సిల్క్, డిజైనరీ చీరలతో శ్రీనగర్‌కాలనీలోని సత్య సాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్ నేటితో ముగియున్నది. ఈ ప్రదర్శనలోని చీరలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శుభకార్యాలకు, పండుగలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన చీరలు ఆకర్షణగా నిలుస్తున్నాయి. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించాలనే సదుద్దేశంలో ఈ ఎగ్జిబిషన్‌ను 70 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

తెలుగు వర్సిటీ పేరు మార్చు తగదు

ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి ఎల్.వీ కుమార్

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం ఎంత మాత్రం సబబు కాదని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి ఎల్.వీ కుమార్ అన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణకు చేసిన సేవలు చిరస్మరణీయమే కానీ..పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. సురవరం పేరును వేరే కొత్తగా ఏర్పాటు చేసే వర్సిటీలకు పెట్టుకోవాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు ఆరాధ్యుడైన పొట్టి శ్రీరాములును గౌరవించడం మనందరి బాధ్యత అని ఎల్.వీ కుమార్ పేర్కొన్నారు. పేరు మార్పు ఆలోచనను విరమించుకుంటే వైశ్య సంఘాల తరుపున ఆందోళనలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.



నిజాం కాలం నాటి కోటగోడ కూల్చివేత

చోద్యం చూస్తున్న అధికారులు

తార్నాక మున్సిపల్ డివిజన్ లాలాపేటలో నిజాం కాలం నాటి పురాతన కట్టడాలను కొందరు అక్రమంగా కూల్చివేస్తున్నారు. ఆ నాటి రాజు లాలాపేటలో తన నివాసం కోసం గడిని నిర్మించారు. ఆ గడి చుట్టూ పెద్ద ప్రహరీ , ఆరు వైపులా పెద్ద పెద్ద దర్వాజలు, బుర్జులను ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటికే అప్పటి నిర్మాణాలైన బుర్జులు, కోట గోడలను పూర్తిగా కనుమరుగు చేశారు. ఆ స్థలాలను యథేచ్ఛగా అక్రమించేశారు. తాజాగా లాలాపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న పెద్ద దర్వాజను ఆనుకుని ఉన్న ప్రహరీ కోట గోడను ఇటీవల కొందరు వ్యక్తులు తమ ఇంటి నిర్మాణాలకు అడ్డుగా ఉందంటూ రాత్రికి రాత్రే కూల్చి వేశారు. ఈ విషయమై స్థానికులు రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని లాలాపేట వాసులు వాపోతున్నారు. చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న నిజాం కాలం నాటి చారిత్రిక కట్టడాలను పరిరక్షించాలనీ లాలాపేట ప్రజలు కోరుతున్నారు. –లాలాపేట



‘హిట్ అండ్ రన్’..

పోలీసులకు సవాల్

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా పరిధిలో తరుచూ జరుగుతున్న హిట్ అండ్ రన్ ఘటనలు పోలీసులకు సవాలుగా మారుతున్నాయి. రాత్రి సమయాల్లో మూలమలుపులు, యూటర్న్‌లతో పాటు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ఎదుట తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

- చిలకలగూడ ఠాణా పరిధిలో ఇటీవల జరిగిన రెండు హిట్ అండ్ రన్ కేసుల్లో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు.
- ఈనెల 2వ తేదీ రాత్రి సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ఎదుట గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడు (32) మృతి చెందాడు. ఢీకొట్టిన వాహనం ఆగకుండా అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయింది.
- మృతుడు గాంధీ పరిసర ప్రాంతాల్లో బిక్షాటన చేసే యాచకుడు కావడంతో అతని వివరాలతోపాటు, ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ లభించలేదు.
- మృతదేహాన్ని గాంధీమార్చురీలో భద్రపరిచి, సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నామని ఎస్ఐ కిషోర్ తెలిపారు.
- గతనెల 24వ తేదిన తార్నాక మెట్రోపిల్లర్ 1084 వద్ద ద్విచక్ర వాహనంపై యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీ కొట్టడంతో ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన మొయిన్‌సుల్తాన అక్కడికక్కడే మృతి చెందాడు.
- మూడు రోజుల పాటు సుమారు 200 సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించి వెస్ట్‌బెంగాల్‌కు చెందిన లారీడ్రైవర్‌ను అరెస్ట్ చేశారు.
- తార్నాక నుంచి మెట్టుగూడ మీదుగా ఆలుగడ్డబావికి వెళ్లే రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు.
- ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కొన్ని పని చేయకపోవడం, మరికొన్నింటికి చెట్టుకొమ్మలు అడ్డురావడంతో, రహదారి ప్రమాదాలు, హిట్ అండ్ రన్ కేసులను చేధించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

దళితుల జీవన స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: దళితుల జీవన స్థితిగతులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షులు అంగిరి ప్రదీప్ ఆదివారం డిమాండ్ చేశారు. ఎస్సీలలో పొందపరచిన 59 కులాల జనాభాతో పాటు విద్య, ఉద్యోగ, ఆర్థిక తదితర అంశాల పై క్షుణంగా అధ్యయనం చేసి కులాల వారిగా జీవన స్థితిగతులను బహిర్గతం చేయాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పు అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో సమన్యాయం పాటించి గతంలో మాదిరి కాకుండా జనాభా దమాషా ప్రకారం విభజించాలన్నారు. అభివృద్ధి పట్ల సీఎంకు చిత్తశుద్ధి ఉంటే చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం జనాభా దామాషా ప్రకారం 18 శాతం రిజర్వేషన్లు పెంచాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

సిగరెట్ కోసం స్నేహితుడిపై బ్లేడుతో దాడి

రాంగోపాల్‌పేట్: మద్యం మత్తులో సిగరెట్ ఇప్పించలేదనే కారణంతో ఓ వ్యక్తి స్నేహితుడిపైనే బ్లేడుతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథన ప్రకారం.. రెజిమెంటల్‌బజార్‌లోని అల్లారఖాలో ఉండే హరీష్ ఇదే ప్రాంతంలో ఓ మొబైల్ షాప్‌లో పని చేస్తున్నాడు. అతనికి వరంగల్‌కు చెందిన కిరణ్ (21) తో స్నేహం ఉంది. ఆదివారం మధ్యాహ్నం కిరణ్.. హరీష్‌ను కలిసి సిగరెట్ ఇప్పించాలని కోరాడు. అప్పటికే కిరణ్ మద్యం మత్తులో ఉన్నాడు. అయితే తన దగ్గర డబ్బు లేవని హరీష్ చెప్పడంతో తన వద్ద ఉన్న బ్లేడ్‌తో హరీష్‌పై దాడికి దిగాడు. దీంతో తీవ్ర రక్తస్రావం అయిన హరీష్‌ను గోపాలపురం పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు ధర్యాప్తు ప్రారంభించారు.

డబుల్ బెడ్‌రూంలు ఇప్పిస్తానని మోసం

బంజారాహిల్స్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తనకున్న రాజకీయ పలుకబడితో ఇప్పిస్తానని నమ్మించి ఓ సినీ నటిని మోసగించిన నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... శ్రీకృష్ణానగర్‌లో నివసించే నడింపల్లి సుజాత సీరియల్ యాక్టర్‌గా, సినిమాల్లో హెయిర్ డ్రెస్సర్‌గా పనిచేస్తుంది. ఈ క్రమంలో సినీ నటీనటులను కారులో షూటింగ్‌ల్లో దింపేందుకు నియమించుకున్న ఎస్.శ్రీనివాస్‌రెడ్డితో ఆమెకు పరిచయం ఏర్పడింది. తనకు చాలామంది రాజకీయ నాయకులు తెలుసునని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని ఆమెను నమ్మించాడు. ఆమె తనతో పాటు పనిచేస్తున్న మరికొందరి నుంచి రూ.6.52 లక్షలు వసూలు చేసి శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చింది. అయితే ఎంతకీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పించకపోగా ఇటీవల మాటమార్చాడు. దీంతో శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాకు రావాల్సిన బిల్లులు చెల్లించండి

పంజగుట్ట: గత సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా ఉచిత చేప పిల్లల సరఫరా చేసిన రైతులకు ఇంకా బిల్లులు రాలేవని వెంటనే బిల్లులు చెల్లించాలని తెలంగాణ చేప పిల్లల ఉత్పత్తి రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన చేపపిల్లల ఉత్పత్తి రైతు, తెలంగాణ ముదిరాజ్ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి బొల్ల వెంకట్ ముదిరాజ్ మాట్లాడుతూ తాము 2023 – 24 సంవత్సరానికిగాను మత్స్యశాఖ ద్వారా పిలవబడిన టెండర్‌లో పాల్గొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపపిల్లల సరఫరా గత సంవత్సరం ఆగస్టు నుంచి నవంబర్ నెలలోపు పూర్తి చేశామని తెలిపారు. వాటి బిల్లు జనవరి మాసంలో రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని ఆయన పేర్కొన్నారు. చేపపిల్లల పెంపకం కోసం అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, సరఫరాకు రవాణా ఖర్చులు అధికభారమయ్యిందని పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన తమకు రావల్సిన బిల్లులు చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమకు రావల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో 2024 – 25 సంవత్సరానికి గాను టెండర్ వేయ్యడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదన్నారు.